## ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్టు



ఖానాపూర్ టౌన్: పోలీస్ స్టేషన్‌లో అరెస్టు అయిన ఆశ కార్యకర్తలు

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 10 : హైదరాబాద్‌లోని కమిషనరేట్ ముట్టడికి తరలి వెళ్లకుండా 18 మంది ఆశ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని మంగళవారం పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ కార్యక్రమంలో రజిత, త్రివేణి, లక్ష్మి, విజయ, జ్యోతి, చంద్రకళ, లలిత, గంగామణి పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 10 : హైదరాబాద్‌లో ఒక రోజు ధర్నా చేపట్టడానికి వెళ్తున్న నిర్మల్ జిల్లా ఆశ కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తూప్రాన్ వద్ద పోలీసులు అడ్డుకుని పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ఆశకార్యకర్తలపైన పోలీసుల దాడి అమానుషం

ఎదులాపురం, డిసెంబర్ 10 : ఆశ కార్యకర్తలు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడం అప్రజాస్వామికమని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) గౌరవాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆశకార్యకర్తలకు నెలకు రూ.18 వేలు వేతనంతో పాటు ఉద్యోగ భద్రత, జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### పెళ్లి అయిన వెంటనే చెక్కులు అందించాలి

ఎదులాపురం, డిసెంబర్ 10 : పెళ్లి అయిన వెంటనే లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తే వారికి కొంత ఇబ్బంది ఉండదని ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల మండలాలకు చెందిన 191 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, బీజేపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### నక్షత్ర దవాఖానపై ఫిర్యాదు

ఎదులాపురం, డిసెంబర్ 10 : నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆదిలాబాద్‌లోని నక్షత్ర దవాఖానపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేశ్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలి

ఎదులాపురం, డిసెంబర్ 10 : సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని పీఆర్టీయూ టీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్పందించి గతంలో వారికి ఇచ్చిన హామీ ప్రకారం న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

### ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 10: ఆదిలాబాద్‌లో మంజూరైన ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి ఐక్యత జిల్లా అధ్యక్షుడు సిడాం సాయి కుమార్ మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్, ఉన్నారు.



బజార్‌హత్నూర్: తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



ఇంద్రవెల్లిలో..



నార్నూర్‌లో..



కుభీర్‌లో..

# తెలంగాణ ఆస్తిత్వాన్ని దెబ్బ తీసేందుకే విగ్రహ మార్పు

- బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు
- తెలంగాణ తల్లి విగ్రహం, చిత్రపటాలకు పాలాభిషేకం

నేరడిగొండ, డిసెంబర్ 10 : తెలంగాణ ఆస్తిత్వాన్ని దెబ్బతీసేందుకే తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అని బీఆర్ఎస్ నియోజకవర్గ శ్రేణులు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదేశాల మేరకు మంగళవారం నేరడిగొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. తెలంగాణ తల్లి అంటే ఒక దేవతామూర్తి అని కిరీటం లేకుండా దేవత ఉంటుందాని ప్రశ్నించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అసూయతో ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీసే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించి 420 హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, ప్రీతమ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు సంధ్యారాణి, బీఆర్ఎస్ మండలాల కన్వీనర్లు శివారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్, డిసెంబర్ 10 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బజార్‌హత్నూర్‌లో బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజల తలరాతలు మారాలి కానీ తల్లుల విగ్రహాలు కాదు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్దేశించి తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, చంద్రశేఖర్, పవన్, సుకుమార్ పాల్గొన్నారు.

### సుంకిడిలో..

తలమడుగు, డిసెంబర్ 10 : తలమడుగు మండలం సుంకిడి గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి తలమడుగు, భీంపూర్, తాంసి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి అవమానపరిచిందన్నారు. మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ తోట వెంకటేశ్, నాయకులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, మగ్గిడి ప్రకాశ్, గజానన్, రమాకాంత్, రజినీకాంత్, జీవీ రమణ, సునీత, రాంబాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరికాదు

ఉట్నూర్, డిసెంబర్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేయడం సరికాదని మాజీ జడ్పీటీసీ జగ్జీవన్ రావ్, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. ఉట్నూర్‌లోని



తలమడుగు: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తబస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చారులత, మాజీ ఎంపీటీసీ సలీం, బీఆర్ఎస్ నాయకులు సింగారే భరత్, విజయ్, అంకవ్వ, సెడ్మాకి సీతారాం, ధరణి రాజేశ్, రమేశ్, పెందూర్ ప్రభాకర్, సోనేరావ్, సత్యం, రమేశ్, చౌకత్ అలీ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, డిసెంబర్ 10 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి నూతనంగా వేరే విగ్రహాన్ని తయారు చేసి ఏర్పాటు చేయడంతో తెలంగాణ ప్రజల మనోభావాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతిసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సుఫియాన్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు మిర్జా జిలానీబేగ్, మాజీ ఎంపీటీసీ మడావి భీంరావ్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు రాంనివాస్, నాయకులు జాదవ్ ప్రకాశ్, పోటే సాయినాథ్, మిర్జా సుఫియాన్‌బేగ్, శివాజీ, లక్ష్మణ్, సుమేద్, స్వామి, బీఆర్ఎస్ సోషల్ మీడియ ఇన్‌చార్జి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

నార్నూర్, డిసెంబర్ 10 : నార్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్ ఆవరణలో తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల పాలాభిషేకం చేశారు. జయశంకర్, కేసీఆర్, రాష్ట్ర మేధావులతో చర్చించి రూపకల్పన చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడంపై నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుతో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, ఐటీడీఏ డైరెక్టర్ మాడావి మాన్కు, మాజీ సర్పంచ్‌లు ఉర్వేత రూప్‌దేవ్, కనక ప్రభాకర్, ఆడా శ్రీరామ్, మడావి రూప్‌దేవ్, మాజీ ఎంపీటీసీ ధర్ము, ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఖాసీం, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, నాయకులు మానిక్‌రావ్, అల్లంఖాన్ పాల్గొన్నారు.

సోన్, డిసెంబర్ 10 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ జనరల్ సెక్రటరీ నయిం, సోషల్ మీడియా రిజ్వాన్‌ఖాన్, జాగృతి అధ్యక్షుడు చారి, అనిల్, మసూద్, మహబూబ్,



ఖానాపూర్‌లో..

అలీ, అజీజ్‌బాయి, విశాల్, సందీప్, అమన్ పాల్గొన్నారు.

భైంసా, డిసెంబర్ 10: భైంసాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం సరైన పద్ధతి కాదన్నారు. తెలంగాణ సంస్కృతికి అనుగుణంగా విగ్రహం ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకులు విలాస్ గాదేవార్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్, గంగాచరణ్, దశరథ్, పోశెట్టి, దేవీదాస్ పాల్గొన్నారు.

కుభీర్, డిసెంబర్ 10 : కుభీర్‌లోని పార్డి(బీ) చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చి ఆవిష్కరించడం దురదృష్టకరమని అన్నారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రేకుల గంగాచరణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్, మాజీ వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, ఉద్యమనాయకుడు పుప్పాల పీరాజీ, నాయకులు దత్తాత్రి, కాశీనాథ్, రాములు, సంజీవ్, శంకర్, పోశెట్టి, బాబు, డాక్టర్ రాజన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సిగ్గుచేటు

ఖానాపూర్, డిసెంబర్ 10 : తెలంగాణ ప్రజల మనోభావాలను దిక్కరిస్తూ సచివాలయం నుంచి తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సిగ్గుచేటని ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని జగన్నాథ్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాలలు వేశారు. విగ్రహాలు మారుస్తే చరిత్ర మారదని కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేయకుండా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మర్చడాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాజగంగన్న, గౌరికర్ రాజు, ఖలీల్, గజేందర్, సుమన్, కరిపే శ్రీనివాస్, మల్లేశ్, నరేశ్, మహిపాల్, నగేశ్ పాల్గొన్నారు.

కడెం, డిసెంబర్ 10: కడెంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్



కడెం: నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఖానాపూర్ రూరల్: సింగాపూర్‌లో ..

ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మెలుగూరి రాజేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ విగ్రహంలో కిరీటం, బతుకమ్మ చిత్రాలను తొలగించి తెలంగాణ ఆస్తిత్వాన్ని దెబ్బతీశారని అన్నారు. సీఎం రేవంత్, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రఫీక్‌హైమద్, ఆయా గ్రామాలకు చెందిన జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

### విగ్రహ మార్పు సరియైనది కాదు

దస్తురాబాద్, డిసెంబర్ 10 : దేవునిగూడెంలో నాయకులు తెలంగాణ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ చరిత్రను మర్చిపోయిందని తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఐలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి అర్గుల రాజనర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగన్న, నాయకులు గోపి, మాణిక్‌రావ్, దుర్గం శంకర్, విజయ్‌కుమార్, కిశోర్, రాజేందర్, మహేశ్, కళ్యాణ్, చారి, నర్సయ్య, తిరుపతి, శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

### సింగాపూర్‌లో..

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 10: ఖానాపూర్ మండలంలోని రాజురా, సింగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగాల అంజన్న, మారుతి, పెద్దిరాజు, కట్ట అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపీలకు తక్షణమే శిక్షణను ప్రారంభించాలి

భైంసా, డిసెంబర్ 10 : గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలకు తక్షణమే శిక్షణ అందించాలని భైంసా డివిజన్ ఆర్‌ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం భైంసాలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏడాది కాలం గడుస్తున్నప్పటికీ ఆర్‌ఎంపీల శిక్షణ విషయమై ఉలుకుపలుకు లేకుండా ప్రభుత్వం ఉండిపోవడం భావ్యం కాదని తెలిపారు. శిక్షణను ఇవ్వకపోవడానికి తోడు తనిఖీల పేరుతో ఆర్‌ఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలపై కేసులు నమోదు చేయడం బాధకరమైన విషయమని అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో ఆర్‌ఎంపీలు ముఖ్యమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆర్‌ఎంపీల శిక్షణ విషయమై చర్చించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్, భైంసా మండలాధ్యక్షుడు అర్జున్, ఉపాధ్యక్షులు సునీల్, సాయికుమార్, కోశాధికారి తుకారాం పాల్గొన్నారు.

### చలో హైదరాబాద్ జయప్రదం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 10 : అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం నాయకులు నిర్మల్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఏసీడీపీవోకు చలో హైదరాబాద్‌కు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయ, ప్రధాన కార్యదర్శి లలిత, కోశాధికారి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 10: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ప్రియుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది ఓ యువతి. ఈ సంఘటన మస్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సుర్జాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి మస్కాపూర్ గ్రామానికి చెందిన ఐనవేని నరేందర్ నాలుగు సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్నారు. పెండ్లి చేసుకుందామని పలుమార్లు యువతి చెప్పిన వినకుండా మోసం చేసినట్లు పేర్కొన్నారు. తనకు న్యాయం చేసేంతవరకు ధర్నా విరమించేది లేదన్నారు.

### బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

తానూర్, డిసెంబర్ 10 : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తహసీల్దార్ లింగమూర్తి అన్నారు. మంగళవారం ఎల్వి గ్రామంలో ఈ నెల 22న మైనర్ బాలిక పెళ్లి కానున్న విషయం తెలుకుని తహసీల్దార్ లింగమూర్తి, మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లిని రద్దు చేశారు..

### కొనసాగుతున్న రిలే దీక్ష

కుంటాల, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, 30 పడకల దవాఖానగా అప్ గ్రేడ్ చేయాలని మిషన్ కుంటాల చైర్మన్ డీ వెంకటేష్ చేపట్టిన నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. దౌనెల్లి మాజీ సర్పంచ్ హైమద్, వివిధ గ్రామాలకు చెందిన పలువురు సంఘీభావం ప్రకటించారు.

## కళాశాలలను తనిఖీ చేసిన డీఐఈవో

బోథ్, డిసెంబర్ 10 : బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం డీఐఈవో రవీందర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడారు.పరీక్షల సమయం దగ్గర పడుతున్న సందర్భంగా ప్రణాళికతో చదవాలని సూచించారు. ఆయన వెంట గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వనజ, ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ సీనియర్ లెక్చరర్ రవికుమార్, లత, తేజస్విని, శాలిని, అపర్ణ, సుప్రియ, అధ్యాపకులు ఉన్నారు.

### మెనూ ప్రకారం భోజనం అందించాలి

బోథ్, డిసెంబర్ 10: బోథ్‌లోని గురుకుల పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో రమేశ్‌తో కలిసి ప్రత్యేకాధికారి వాజిద్ అలీ ఆహార నాణ్యత తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వాజిద్ అలీ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, నాసిరకం, కల్తీ పదార్థాలకు దూరంగా ఉండాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఆహార నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామారావ్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయు ఉన్నారు.

### కష్టపడితేనే విజయం సాధ్యం

బోథ్, డిసెంబర్ 10 : కష్టపడితేనే విజయం సాధ్యమవుతుందని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సొనాలలోని జడ్పీ సెకండరీ పాఠశాలలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు 40 స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సదానందం, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అభిలాష్, మ్రుణాల్ గౌడ్, కార్తీక్ రెడ్డి, సుగుణాకర్, సుధీర్ రెడ్డి, ఉదయ్, చిన్నయ్య, సోమన్న, మహేందర్, గౌతం రెడ్డి పాల్గొన్నారు.

### క్షయ నివారణకు చర్యలు

నార్నూర్, డిసెంబర్ 10 : క్షయవ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని హెల్త్ ఎడ్యుకేటర్ రాథోడ్ రవీందర్ అన్నారు. గాదిగూడ మండలం ఝరి గ్రామంలో క్షయవ్యాధి గుర్తించేందుకు ఇంటింటా సర్వే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి గుర్తించేందుకు ఇంటింటా వివరాలు సేకరించామని తెలిపారు. క్షయవ్యాధి బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్ మారుబాయి, ఆశ కార్యకర్త అంజన్నబాయి ఉన్నారు.

### చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

ముథోల్, డిసెంబర్ 10 : ముథోల్ మండలం బోరిగాం గ్రామానికి చెందిన కస్ప శ్రీనివాస్ (45) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

భైంసా, డిసెంబర్ 10 : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం భైంసాలోని బృందావన్ గార్డెన్‌లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ కన్‌స్ట్రక్షన్, లయన్స్ క్లబ్ భైంసా డైమండ్ , దివ్యాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దివ్యాంగుడు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు తీసుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగులకు కల్పించిన హక్కుల ప్రకారం ప్రభుత్వ పథకాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, డాక్టర్ దామోదర్ రెడి, డాక్టర్ కాశీనాథ్, సీడీపీవో రాజశ్రీ, స్నేహ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్, సిద్ధయ్య, మహేశ్, వెంకటేశ్, రామకృష్ణగౌడ్, ముత్యం రెడ్డి పాల్గొన్నారు.

## ముక్రా(కే) హమారా సౌచ్చాలయ్ - హమారా సమ్మాన్ అవార్డు







అవార్డు అందుకుంటున్న చౌహాన్ శోభ తులసీరామ్, ప్రత్యేకాధికారి జాదవ్ కైలాస్

ఇచ్చోడ, డిసెంబర్ 10: ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామానికి హమారా సౌచ్చాలయ్ -హమారా సమ్మాన్ అవార్డ్ వచ్చింది. మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో బెస్ట్ టాయిలెట్‌ను ఎంపిక చేసి రెండు అవార్డులు ఇచ్చింది. ఆదిలాబాద్‌లో ఈ అవార్డులను డీఆర్డీఏ సాయన్న అందజేశారు. వ్యక్తిగత మరుగు దొడ్ల అవార్డును చౌహాన్ శోభ తులసీరామ్ అందుకున్నారు. కమ్యూనిటీ టాయిలెట్ అవార్డును ప్రత్యేకాధికారి జాదవ్ కైలాస్, కార్యదర్శి పురుషోత్తం అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్, సంపత్, జావిద్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ సభ్యులు పాల్గొన్నారు.

### పరీక్షల్లో విజయాన్ని సాధించండి

బాసర, డిసెంబర్ 10 : విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షల్లో విజయాన్ని సాధించాలని ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ అన్నారు. మంగళవారం బాసర ట్రిపుల్‌ఐటీ యూనివర్సిటీలోని శాతవాహన గ్రౌండ్‌లో పీయూసీ విద్యార్థులకు ఒత్తిడిని అధిగమించడం ఎలా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రణధీర్‌సాగి, అసోసియేటెడ్ డీన్స్ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, డాక్టర్ చంద్రశేఖర్, చీఫ్ వార్డెన్ శ్రీధర్, డాక్టర్ రాములు, పీఆర్‌వో డాక్టర్ విజయ్‌కుమార్, బావుసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### కైలాస్ టెకిడి ఆలయ హుండీ లెక్కింపు

బోథ్, డిసెంబర్ 10 : బోథ్ మండలంలోని నిగిని గ్రామ పంచాయతీ పరిధిలోని కైలాస్ టెకిడి నర్మదేశ్వరుని ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవస్థాపకులు సంత్ శ్రీ లింబాజీ మహారాజ్ సమక్షంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.15,80,728 నగదుతో పాటు కిలో వెండి సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

### పాఠశాలకు బీరువా విరాళం

కుభీర్, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు బీఆర్ఎస్ మండల నాయకుడు దొంతుల లింగన్న రూ.10వేల విలువ చేసే బీరువాను మంగళవారం పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. ఆయన కూతురు దొంతుల అనిత ఇదే శిశుమందిర్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించింది. ఇటీవల అనితకు జూనియర్ లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. హెచ్‌ఎం ఈర్ల హన్మాండ్లు, టీచర్లు తండ్రి, కూతురిని సత్కరించారు.

### మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

ఎదులాపురం, డిసెంబర్ 10 : ఆదిలాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ పోటీలను అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సరదాగా కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, ఎస్‌ఎఫ్ కార్యదర్శి కాంతారావు, పేట సంఘం కార్యదర్శి స్వామి, ఎంఈవో సోమయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, డిసెంబర్ 10: న్యూలోలం లిటిల్ స్కాలర్ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను మంగళవారం నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, బన్సపల్లి సహకార సంఘం చైర్మన్ పీవీ రమణరెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈవో శంకర్, ఎంపీడీవో అరుణ, దిలావర్‌పూర్ ఎస్‌ఐ సందీప్ పాల్గొన్నారు.

### బాలిక అదృశ్యం

ఎదులాపురం, డిసెంబర్ 10: ఆదిలాబాద్ వన్ టౌన్ పరిధిలోని కోలిపురకు చెందిన మైనర్ బాలిక(16) అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం జాతర ఎగ్జిబిషన్‌కు వెళ్లొస్తానని వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు ఇండ్లల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### ఎమ్మెల్యే శంకర్‌పై ఫిర్యాదు

కుంటాల, డిసెంబర్ 10 : వెలమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని వెలమ సంఘం నాయకులు సోమవారం కుంటాల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ భాస్కరాచారికి ఫిర్యాదు చేశారు. ఇక్కడ వెలమ సంఘం సభ్యులు జీవీ రమణ రావు, వెంగళరావు, సాగర్ రావు, ప్రణయ్ రావు, లింగారావు, కేఎం రావ్, పృథ్వీదర్ రావు, రమాకాంత్, ప్రశాంత్, విలాస్, నర్సింగ్‌రావు ఉన్నారు.

### ఆదిలాబాద్ విద్యుత్ ఎస్ఈకి ఉద్యోగోన్నతి

ఎదులాపురం, డిసెంబర్ 10: ఆదిలాబాద్ విద్యుత్ ఎస్ఈ జేఆర్ చౌహాన్‌కు టీజీఎన్పీడీసీఎల్ వరంగల్‌లో చీఫ్ ఇంజినీర్‌గా (సీఈ) ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సీఎండీ వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జేఆర్ చౌహాన్‌ను మంగళవారం 1104 యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు విలాస్, కార్యదర్శి కిరణ్ నాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### జిల్లా జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి

ఎదులాపురం, డిసెంబర్ 10: మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ భోవనగిరి సౌజన్య జిల్లా జైలును మంగళవారం సందర్శించారు. ఖైదీలకు వారికి హక్కులు, విధుల గురించి అవగాహన కల్పించారు. కార్యదర్శి వెంట డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిలర్ ఆర్గుల అశోక్, జైలర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉన్నారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి

బోథ్, డిసెంబర్ 10: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఏపీవో జగ్దేరావ్ అన్నారు. మంగళవారం పుణ్యానాయక్ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుమ్ర సత్యవతి కోటేశ్వర్

ఇచ్చోడ, డిసెంబర్ 10 : ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుమ్ర సత్యవతి కోటేశ్వర్, వైస్ చైర్మన్‌గా చౌహాన్ శేషారావ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సైతం బాధ్యతలు స్వీకరించారు

### అసత్య ప్రచారాలు నమ్మవద్దు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 10: నిర్మల్ జిల్లా ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు ఆర్డీవో వాహనాన్ని అడ్డుకున్న సందర్భంగా పోలీసులు కేసులు నమోదు చేసినట్లు వచ్చిన పుకార్లను నమ్మవద్దని తెలిపారు. కొందరు పని గట్టుకుని సామాజిక, ఇతర మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని ఎవరూ నమ్మవద్దని తెలిపారు.ఎవరిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338976-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677